క్లుప్తంగా

శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు



అన్నవరప్పాడులో విశ్వేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెరవలి: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సోమవారం కావటంతో భక్తులు శైవ క్షేత్రాలకు పోటేత్తారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మండలంలోని అన్నవరప్పాడు, మల్లేశ్వరం, తీపర్రు, ఖండవల్లి, ముక్కామల, కానూరు అగ్రహారం గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

దుర్గా మల్లేశ్వరునికి అన్నాభిషేకం



కె.సావరంలో ప్రత్యేకాలంకరణలో దుర్గా మల్లేశ్వరస్వామి

ఉండ్రాజవరం: మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా కె.సావరం గ్రామంలో ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామికి సోమవారం అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే పాలంగిలో రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. భక్తులు క్యూలో నిలబడి అన్నాన్ని అర్చకుల ద్వారా స్వామివారికి సమర్పించారు.

వరద గోపాలస్వామికి లక్ష తులసీ పూజ



స్వామికి లక్ష తులసీ దళాలతో పూజ చేస్తున్న పండితులు

కొవ్వూరు: పట్టణంలో పాతూరులోని రుక్మిణీ,సత్యభామ సమేత వరద గోపాలస్వామికి ధనుర్మాసం సందర్భంగా లక్షతులసీ దళాలతో పూజ నిర్వహించారు. విష్ణు సహస్ర నామ పారాయణ సమితి ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఆలయ అర్చకుడు గోవర్ధనం అనంత గోపాల్, గోవర్ధనం శ్రీనివాసమూర్తి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తాంజనేయుని ఆలయంలో హనుమద్వ్రతం



స్వామివారికి అరటిపండ్ల నివేదన

చాగల్లు: హనుమద్వ్రత మహోత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్ రోడ్‌లో ఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేష అభిషేకాలు, సహస్ర సింధూరం పూజ, 1,108 అరటి పండ్లతో స్వామి వారికి పూజా కార్యక్రమాలు జరిగాయి. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. నిత్యం ఆలయం వద్ద సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయని కమిటీ సభ్యుడు వేంకటరావు తెలిపారు.

28న మెగా వైద్య శిబిరం



శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మానవత సభ్యులు

తాళ్లపూడి: మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న స్థానిక సొలస దమయంతి సత్యనారాయణ ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కార్యక్రమ పోస్టర్‌ను సంస్థ గౌరవ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు, గౌరవ డైరెక్టర్ గోకవరపు బాబులు, సభ్యులు ఆవిష్కరించారు. సుమారు 30 మంది ప్రముఖ వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ సందర్భంగా సింహాద్రి జనార్దనరావు మాట్లాడుతూ, క్యాన్సర్ నిర్ధారణ, గర్భాశయ, ఉదర పరీక్షలు, ఊపిరితిత్తుల ఎక్స్‌రే, గుండె పరీక్షలు, చర్మ, కిడ్నీ, మూత్రకోశ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, కంటి, నరాలు, ఎముకలు, కీళ్ల, దంత పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారని వివరించారు.

ఖాకీలపై అదనపు భారం

- బయటి విధుల్లో పెరవలి పోలీసులు
- సిబ్బంది కొరతతో వెలవెలబోతున్న స్టేషన్
- పరిష్కారం కాని సమస్యలు



పెరవలి పోలీసు స్టేషన్

పెరవలి: శాంతి భద్రతల పరిరక్షణకు కీలకమైన పోలీసు వ్యవస్థలోనూ చిక్కులు తప్పడం లేదు. తగినంత సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పోలీసు స్టేషన్ల కార్యకలాపాల్లో విఘాతం తప్పడం లేదు. పెరవలి పోలీస్ స్టేషన్‌కు సరిపడా సిబ్బంది రికార్డుల్లో చూపుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం కానరావడం లేదు. దీంతో ఇక్కడ మిగిలిన సిబ్బందిపై అదనపు భారం పడి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ప్రమాదాలు అతి ఎక్కువగా జరిగే ప్రాంతాలలో పెరవలి టాప్‌–5లో ఉంది. అయినా ఇక్కడ సిబ్బంది బయట విధులు నిర్వర్తించడంలోను క్రియాశీలకంగానే ఉన్నారని చెప్పవచ్చు.

అవసరానికంటే తక్కువగా..

వాస్తవానికి ఈ పోలీస్ స్టేషన్‌లో 27 మంది సిబ్బంది ఉండాలి, వీరిలో ఒక ఎస్సై, ఇద్దరు ఏఎస్సైలు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 17 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించాలి. కానీ 27 మంది ఉండాల్సిన ఈ స్టేషన్‌లో రికార్డుల్లో 19 మంది ఉండగా, ఇందులో ఇద్దరు ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో కానిస్టేబుళ్ల కొరత ఈ స్టేషన్‌లో చాలా ఎక్కువగా ఉంది.

ఇతర ప్రాంతాల్లో డ్యూటీలు

ఉన్న సిబ్బందిలో నిత్యం ఆరు నుంచి ఎనిమిది మంది బయట విధులు నిర్వర్తిస్తుండటంతో, స్టేషన్‌లో సిబ్బంది కొరతతో అగచాట్లు పడుతున్నారు. అంతేకాకుండా అందుబాటులో ఉన్న సిబ్బందిలో కొందరిని విజయవాడలో విదులు నిర్వర్తించడానికి డ్యూటీలు వేస్తున్నారు. దీంతో మరింత మంది తగ్గి ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. అందుబాటులో ఉన్న సిబ్బందితో పగలు ముగ్గురు విధులు నిర్వర్తిస్తుండగా, మిగిలిన వారు గ్రామాల్లో గస్తీ తిరగాల్సి వస్తోంది.

సత్వర చర్యలకు ఆటంకం

మొత్తం 19 మంది కానిస్టేబుళ్లలో సగం మందే స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తుండడంతో, ఎటువంటి ప్రమాదాలు జరిగినా సత్వర చర్యలు తీసుకోవడంలో ఆటంకం ఏర్పడుతోంది. ఈ స్టేషన్‌కు నిత్యం 10 నుంచి 15 ఫిర్యాదులు రావటం, వాటిని పరిష్కరించడానికి గ్రామాల్లోకి వెళ్లడానికి సిబ్బంది లేక, స్వల్ప సమస్యలు కూడా రోజుల తరబడి కొనసాగుతున్నాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల సమస్యలు పరిష్కారం కాక నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఇక్కడే విధులు నిర్వర్తిస్తే..

ఈ స్టేషన్‌కు కేటాయించిన సిబ్బందిని వేరే చోట డ్యూటీలు వేయకుండా ఉంటే, ఎటువంటి సంఘటనలు జరగవని, శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని పలువురు అంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో కోడిపందాలు, పేకాట, అక్రమ ఇసుక తవ్వకాలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలు, కొట్లాటలు జరగకుండా చూడాల్సిన సిబ్బంది.. వారికే ఎక్కడ డ్యూటీ నిర్వర్తించాలో తెలియక నానాపాట్లు పడుతున్నారు.

> **పని చేయక తప్పదు**
>
> పోలీసులు తమ విధులను ఎక్కడ అవసరమైతే అక్కడ నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇది అంతా డ్యూటీలో భాగమే.
>
> – వెంకటేశ్వరరావు, ఎస్సై, పెరవలి

త్రీమెన్ కమిటీల నియామకంపై కసరత్తు

- కొవ్వూరు డివిజన్‌లో 58 సొసైటీలు
- వైఎస్సార్ సీపీ బాటలోనే కూటమి ప్రభుత్వం



దేవరపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘు కార్యాలయం

దేవరపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(సొసైటీ)కు త్రీమెన్ కమిటీల నియామకంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై కూటమి నాయకులు గ్రామాల్లో చర్చలు జరుపుతున్నారు. ముగ్గురు సభ్యులను నియమించి, వీరిలో ఒకరిని చైర్‌పర్సన్‌గా నియమిస్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవలంబించిన పద్ధతినే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు సమాచారం. సొసైటీ చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న నాయకులు ఎక్కువ మంది ఉండడంతో, ఆశావాహుల మధ్య రాజీ ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. కొవ్వూరు డివిజన్‌లోని మూడు నియోజకవర్గాల్లో 58 సొసైటీలుండగా, గోపాలపురం నియోజకవరవర్గంలోని నాలుగు మండలాల్లో 17 సొసైటీలున్నాయి. దేవరపల్లి మండలంలో ఏడు సొసైటీలు ఉన్నాయి. గోపాలపురం నియోజకవర్గంలోని 17 సొసైటీల్లో 15 టీడీపీ, రెండు జనసేన పార్టీలకు కేటాయించినట్టు తెలిసింది. దేవరపల్లి మండలంలో త్యాజంపూడి సొసైటీ జనసేన పార్టీకి కేటాయించే అవకాశాలు ఉన్నట్టు పార్టీ శ్రేణుల సమాచారం.

2019 నుంచి పరిపాలన

కాగా 2018లో సొసైటీల పాలకవర్గాల పదవీ కాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నియమించింది. 2019లో కొత్తగా ఏర్పడిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సొసైటీల పర్సన్ ఇన్‌చార్జిలను తొలగించి, త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసింది. చైర్‌పర్సన్‌తో పాటు, ఇద్దరు సభ్యులను నియమించింది. 2024 జూన్ 12న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పటి వరకున్న త్రీమెన్ కమిటీలను రద్దు చేసి, పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. సొసైటీలకు ఎన్నికలు జరుగుతాయని భావించినప్పటికీ, ప్రభుత్వం త్రీమెన్ కమిటీల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.కమిటీల ఏర్పాటుపై ఉత్తర్వులు అందలేదని సొసైటీల సీఈఓలు చెబుతున్నారు.

వెలవెలబోతున్న రెవెన్యూ సదస్సులు



జనం లేక వెలవెలబోతున్న దేవరపల్లి రెవెన్యూ సదస్సు

దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా జరుగుతున్నాయి. సదస్సులకు పట్టుమని పది మంది కూడా రావడం లేదు. రైతుల సంఖ్య తక్కువగా ఉండడంతో సభలు వెలవెలబోతున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు సభలు నిర్వహించి, రైతులు, ప్రజల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్నారు. సోమవారం దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ రాజ్యలక్ష్మి అర్జీలు స్వీకరించారు. సదస్సులో 10 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ సదస్సులో మాజీ ఎంపీటీసీ సభ్యులు కడిమి రాజు, పంచాయతీ సభ్యులు పచ్చా రాంగోపాల్, కరుటూరి బాలాజీ, పంచాయతీ కార్యదర్శి ఎన్. రవికిషోర్, పలువురు వీఆర్వోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

కొవ్వూరు: వివిధ భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. రైతుల అర్జీలు 33 రోజుల్లో పరిష్కారం అవుతాయన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. రైతులు విన్నవించిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో 35 అర్జీలు వచ్చాయి. సర్పంచ్ వెలగన నరేష్, ఎంపీటీసీ కొర్లపాటి మోహన్, డిప్యూటీ తహసీల్దార్ బి.ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: గ్రామ శివార్లలో ఉన్న రెవెన్యూ పోరం బోకు భూమిని పేదలకు కేటాయించాలని కొందరు గోపాలపురం రెవెన్యూ సదస్సులో విన్నవించారు. ఈ సదస్సులో 11 అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె అజయ్‌బాబు తెలిపారు.

ఎస్టీలకు సంక్షేమ ఫలాలు అందాలి

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



ముద్దూరులో వినతిపత్రం స్వీకరిస్తున్న శంకర్ నాయక్

కొవ్వూరు: ఎస్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు వదిత్య శంకర్ నాయక్ అన్నారు. మండలంలోని మద్దూరు, వాడపల్లి గ్రామాల్లో ఎరుకలు, చెంచు సామాజిక వర్గీయులు నివసించే ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. మద్దూరులోని కల్యాణ మంటపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పిల్లలు హైస్కూల్‌కు మూడు కి.మీ. దూరంలో ఉన్న సీతంపేట వరకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు. మద్దూరులో హైస్కూలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని శంకర్ నాయక్ ప్రకటించారు. విద్య ద్వారా గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎరుకలు, చెంచులతో పాటు, గిరిజనులందరికీ ఆధార్ నంబర్లతో పాటు, రేషన్ కార్డులు అందించాలని అధికారులను ఆదేశించారు. పందుల పెంపకానికి స్థలాన్ని కేటాయించాలని, గ్రామంలో ఏకలవ్య విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎరుకల సంఘ నాయకులు కోరారు. పలువురు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. ఎస్టీలు తమ సమస్యలను వివరిస్తే పరిష్కరిస్తానని ఆర్డీవో రాణి సుస్మిత చెప్పారు. ఎంపీడీవో కె.సుశీల, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జ్యోతి, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కమిషన్ దృష్టికి ఎస్టీల సమస్యలు

చాగల్లు: ఎస్టీల సమస్యలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళతానని ఏపీ రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు వదిత్య శంకర్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని మీనా నగరంలో పర్యటించారు. సంచార, చెంచు సామాజిక వర్గీయులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.మేరికమ్మ, ఎంపీడీవో ఆర్ శ్రీదేవి పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఆలీ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



గోపాలపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు

తాళ్లపూడి: విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.


చాగల్లు: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఇందన పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ త్రిమూర్తులు తెలిపారు. చాగల్లు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

గోపాలపురం: విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ఎలక్ట్రికల్ ఏడీఏ కె శ్రీనివాస్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచణ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిడదవోలు: విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ నెం.2లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏడీఈ పీయూబీ శ్రీధర్ మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకుంటే భవిష్యత్తు తరాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఏఈ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వూరు: పట్టణంలోని అభ్యాస స్కూలులో ఇందన పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ ఎం.కృష్ణ నాయక్, ఏఈ డి.జగదీశ్వరరావు, పాఠశాల కరస్పాండెంట్ పాలడుగుల రఘురామ్, జేఈ ఎస్‌వీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, దైవజనులు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం బెతెస్థ వర్షిప్ ప్రార్థన మందిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, డి.ముప్పవరం మాజీ సర్పంచ్ మద్దాల ప్రభు, దైవజనులు ఎన్‌వీ రావు కట్ చేశారు. చిన్నారుల క్రిస్మస్ నాటికలు, యాక్షన్ సాంగ్స్ ఆకట్టుకున్నాయి. వృద్ధులకు నిత్యావసర సరకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం క్రైస్తవ విశ్వాసులకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశాబత్తుల నాగప్రసాద్, డి.సన్నీ, ఎస్‌కే ఇర్ఫాన్ పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాలు చిరస్మరణీయం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి

నిడదవోలు: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.జ్యోతి అన్నారు. కళాశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు స్థానిక వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక



జూనియర్ బాలుర జట్టు



జూనియర్ బాలికల జట్టు

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాలలో జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్టు సంఘ కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు. 15 మంది బాలురు, 14 మంది బాలికలతో జట్లు ఎంపిక చేశామని చెప్పారు. వీరు ఈ నెల 22 నుంచి 25 వరకు రావులపాలెంలో జరిగే 50వ స్టేట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కొవ్వూరు: పట్టణంలో మంగళవారం నుంచి ఈ నెల 28 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఏబీఎన్ కళాశాలలో, 19,20 తేదీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 26, 27 తేదీల్లో పీఎంఎం మున్సిపల్ హైస్కూలులో, 28న అల్లూరి నాగరత్నం బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కమర్షియల్ సర్వీసుల వివరాల సేకరణ

తాళ్లపూడి: కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కమర్షియల్ విద్యుత్ సర్వీసులు కలిగి ఉన్న వ్యాపార సంస్థల వివరాలను సేకరిస్తున్నట్టు ఎంపీడీవో టీబీ వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఎంఎస్‌ఎంవీ సర్వేకి సంబంధించి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేస్తారన్నారు. వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు

కొవ్వూరు: మహిళలు కుట్టు శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ సౌజన్యంతో స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక సచివాలయంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

అన్నదేవరపేటలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అన్నదేవరపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విక్రమాదిత్య

తాళ్లపూడి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆచరించినప్పుడే సమాజంలో అసమానతలు తొలగుతాయని పారిశ్రామిక వేత్త అల్లూరి విక్రమాదిత్య అన్నారు. మండలంలోని అన్నదేవరపేట పాతపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. బీంరామ్ రాంజీ అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలిపే సాధారాణి, కొవ్వూరు రూరల్ సీఐ బాలకృష్ణ, ఎస్సై టి రామకృష్ణ, సంఘ సభ్యులు ఎలిపే బాలస్వామి, ఎలిపే గోపాలరావు, వెంకటేష్, గుమ్మడి చంద్రశేఖర్, నల్లి పోశియ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మురుగు దమ్ములు



తీపర్రులో మురుగ దమ్ము చేస్తున్న రైతు

పెరవలి: రబీ సాగుకు నాట్లు సకాలంలో వేస్తే ప్రకృతి వైపరీత్యాల నుండి పంటలను రక్షించుకోవచ్చని వ్యవసాయాధికారులు చెప్పడంతో రైతులు ముమ్మరంగా మురుగ దమ్ములు చేస్తున్నారు. ఇప్పటికే బోర్లపై ఆకుమడులు వేసిన రైతులు మరో రెండు, మూడు రోజుల్లో నాట్లు వేయటానికి సిద్ధపడుతున్నారు. పెరవలి మండలంలో రబీ వరి 8,500 ఎకరాల్లో సాగు చేయటానికి రైతులు సిద్ధపడుతున్నారని, అందుకు అనుగుణంగానే చేలను సిద్ధం చేస్తున్నారని ఏఓ మేరీ కిరణ్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత



పెరవలి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న టాస్క్‌ఫోర్స్ సీజ్ చేసిన లారీ

పెరవలి: కానూరు–పెండ్యాల ఇసుక ర్యాంప్ నుండి ఎటువంటి బిల్లులు లేకుండా రవాణా చేస్తున్న ఇసుక లారీని ప్రత్యేక టాస్క్‌పోర్స్ పట్టుకుని పెరవలి పోలీస్ స్టేషన్‌కు అప్పగించింది. కొంత కాలంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని వస్తున్న వార్తల నేపథ్యంలో, జాయింట్ కలెక్టర్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ టీమ్ సోమవారం మధ్యాహ్నం పెరవలి మండలంలోని తీపర్రు–కాకరపర్రు గ్రామాల మధ్య ఈ లారీని పట్టుకున్నారు. దీనిని పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, జిల్లా మైనింగ్ అధికారులకు రిపోర్టు చేశారు.

వ్యాన్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు



ధ్వంసమైన ట్రావెల్స్ బస్సు

నల్లజర్ల: అనంతపల్లి శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. గుంటూరు నుంచి విశాఖపట్నం వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ముందు వెళుతున్న వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం, దెబ్బతిన్నాయి. బస్సులో ఉన్న 40 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. నల్లజర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికులను వేరే వాహనంలో గమ్యస్థానాలకు పంపారు. మంచు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.